ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 21 ఆగస్టు 2024



వలస కార్మికులకు రేషన్

- కార్డులు ఉన్నవారికి ఈ-కేవైసీకి అవకాశం
- కొత్త రేషన్ కార్డుల కోసం సర్వే
- జిల్లాలో వలస కార్మికులు 15 వేల మంది
- రేషన్ కార్డు అర్హులుగా 786 మందికి ప్రతిపాదనలు
- జిల్లాలో 1,73,743 రేషన్ కార్డులు, ఈ కేవైసీ 80.19 శాతం పూర్తి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఉపాధిని వెతక్కుంటూ జిల్లాకు వలసవచ్చిన అంతర్‌రాష్ట్ర కూలీలు చాలా మంది ఇక్కడే స్థిరపడ్డారు. వీరిలో చాలా మందికి రేషన్‌కార్డులు ఉన్నా ఈ-కేవైసీ లేకపోవడంతో రేషన్ రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తెల్లరేషన్ కార్డు కలిగిన వలస కూలీలు ఈ-కేవైసీ చేసుకునే వీలు కల్పించింది. తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఈ-కేవైసీ ప్రక్రియ గత సంవత్సరం సెప్టెంబరు నుంచి ఫిబ్రవరి వరకు కొనసాగించారు. ఇందులో ఇతరరాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు ఈ కేవైసీ చేసుకోలేదు. ఈ-కేవైసీ నుంచి అవగాహన లేకపోవడం, తరచూ ఒక ఊరి నుంచి మరొక ఊరికి మారిన క్రమంలో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ పరిస్థితుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు వలస వచ్చిన ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌కు సం బంధించి రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో కార్మికులు వలస వస్తున్నారు. దాదాపు 15 వేల నుంచి 20 వేల వరకు వలస కార్మికులే ఉన్నారు. ఇందు లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల వారు ఎక్కువగా ఇక్కడే స్థిరపడ్డారు. రేషన్ కార్డులు పొందారు. వీరికి ఈ కేవైసీ చేసుకోవడానికి రేషన్ కార్డు లింకేజీలో అధార్ కార్డు, రేషన్ కార్డు చిరునామాల్లో తేడాలు ఉండ డంతో ఈ కేవైసీ కాలేదు. ఈ సారి ప్రత్యేక పోర్టల్ ద్వారా రేషన్ డీలర్ నుంచి ఈ కేవైసీ చేసుకునే వీలు కల్పించారు. ఈ నెల 12న ప్రభుత్వం మార్గదర్శకాలను పౌరసరఫరాల శాఖ అధికారులకు అందాయి. దీనికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించే దిశగా తహసీల్దార్‌ల ద్వారా రేషన్‌డీలర్లకు చేరే విధంగా చర్యలు చేపట్టారు. త్వరలోనే ఈ కేవైసీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

జిల్లాలో మండలాల వారీగా ఈ- కేవైసీ వివరాలు...

మండలం	రేషన్‌కార్డులు	లబ్ధిదారులు	ఈకేవైసీ	శాతం
బోయినపల్లి	11906	32761	25471	77.75
చందుర్తి	10940	29557	24190	81.84
గంభీరావుపేట	14401	40842	38839	80.40
ఇల్లంతకుంట	15553	42573	33863	79.54
కోనరావుపేట	13919	40244	31487	78.24
ముస్తాబాద్	14385	41889	33139	79.11
రుద్రంగి	4846	14630	10765	73.58
సిరిసిల్ల	26830	79489	63143	79.43
తంగళ్లపల్లి	14101	40283	33446	83.03
వీర్నపల్లి	4205	12822	10459	81.57
వేములవాడ	19569	56964	45545	79.95
వేములవాడరూరల్	7440	20744	16849	81.22
ఎల్లారెడ్డిపేట	15648	44283	35207	79.50
మొత్తం	173743	497081	398619	80.19

● వలస కార్మికులకు రేషన్ కార్డులపై సర్వే

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వస్త్ర పరిశ్రమను నమ్ముకుని తెలంగాణలోని ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చిన వారు ఉండగా ఇతర రాష్ట్రాల నుంచి భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్ట్ పనులకు, ఇటుక బట్టీలతో పాటు ఇటీవల వ్యవసాయ పనులకు కూడా కార్మికులు పెద్దసంఖ్యలోనే వలస వస్తున్నారు. సంవత్సరాల తరబడి ఇక్కడే ఉండిపోతున్నా వారిలో రేషన్ కార్డులు పొందని వారు ఉన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు వలస కార్మిక కుటుంబాలకు కూడా రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లాలో వలస కుటుంబాలకు సంబంధించి సర్వే నిర్వహించారు. వారి వద్ద నుంచి రేషన్‌కార్డుల కోసం 1,655 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు పరిశీలించి 786 మంది కార్మికులకు కార్డులు ఇచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదిక పంపారు. 869 దరఖాస్తులను తిరస్కరించారు. జిల్లాలో వలస కుటుంబాల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో బోయినపల్లిలో 135 దరఖాస్తులు, చందుర్తిలో 67, గంభీరావుపేటలో 97, ఇల్లంతకుంటలో 240, కోనరావుపేటలో 125, ముస్తాబాద్‌లో 96, రుద్రంగిలో 38, తంగళ్లపల్లిలో 143, వీర్నపల్లిలో 23, వేములవాడ అర్బన్‌లో 144, వేములవాడ రూరల్‌లో 63, సిరిసిల్లలో 326, ఎల్లారెడ్డిపేటలో 133 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్, సిద్ధిపేటకు సం బంధించి 25 దరఖాస్తులు జిల్లాకు పంపించారు. వీటిలో 786 మంది రేషన్‌కార్డులు అందించే ప్రక్రియకు పరిశీలన జరుగుతోంది.





ఈ కేవైసీ చేస్తున్న లబ్ధిదారులు

● జిల్లాలో 80.19 శాతం ఈ-కేవైసీ పూర్తి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,73,743 రేషన్ కార్డులు ఉండగా 4,97,081 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో అంత్యోదయ అన్నయోజన కార్డులు 13,724 ఉండగా 36,645 మంది లబ్ధిదారులు ఉన్నారు. అహార భద్రత కార్డులు 1,59,812 కార్డులు ఉండగా 46,0226 మంది లబ్ధిదారులు, 207 అన్నపూర్ణ కార్డులు ఉండగా 210 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి సంబంధించి గత సంవత్సరం సెప్టెంబరు నుంచి ఫిబ్రవరి వరకు ఈ కేవైసీ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలోని 345 రేషన్ దుకాణాల ద్వారా 80.19 శాతం ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు.

డీసీఎస్‌వోగా వసంత లక్ష్మి

● ఏసీఎస్‌వోగా నందిని

సిరిసిల్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో బదిలీల ఉత్తర్వులను సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పౌరసరఫరాల అధికారిగా ఉన్న ఎస్ జితేందర్‌రెడ్డిని జగిత్యాల ఇంచార్జ్ సీఎస్‌వోగా బదిలీ కాగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు పి వసంతలక్ష్మిని నియమించారు. మహబూబాబాద్ ఏసీఎస్‌వో బి నందిని జిల్లాకు బదిలీపై వస్తున్నారు.

పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్‌గా రజిత

సిరిసిల్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్‌గా పి రజితను నియమిస్తూ మంగళవారం కార్పొరేషన్ ఎండీ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల జిల్లా మేనేజర్‌గా ఉన్న ఎజీ జితేంద్రప్రసాద్ జగిత్యాలకు బదిలీ కాగా జగిత్యాలలో మేనేజర్‌గా ఉన్న పి రజితను సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీర్నపల్లి, ఆగస్టు 20: గర్జనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉమ్మడి ఎల్లారెడ్డిపేట సెస్ ఏఈ పృథ్వి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆ పరిధిలోని గర్జనపల్లి, వన్‌పల్లి, అడవిపదిర, శాంతినగర్, లాల్‌సింగ్ తండా గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ప్రదర్శన తీస్తూ వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వర లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యులు స్రవంతి, చిరంజీవి, పీహెచ్‌ఎన్ రజని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

● బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రదర్శన



ఎల్లారెడ్డిపేటలో విద్యార్థుల మానవహారం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ విభాగం ఆధ్వర్యంలోని విద్యార్థులు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బస్టాండు ప్రాంతంలో మానవహారంగా ఏర్పడి నివాళులు అర్పించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సనత్‌రెడ్డి, బాలకిషన్, కుమార్, అరవింద్, పవన్, అనిల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి



నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట, ఆగస్టు 20: పాలకవర్గ సభ్యులు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకం అయిన ఐరెడ్డి చైతన్య, ఉపాధ్యక్షుడుగా నియామకం అయిన ఎలగందుల ప్రసాద్‌లతో పాటు డైరెక్టర్లకు మంగళవారం నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, మాజీ ఎంపీపీ అయిలయ్య, మాజీ ప్యాక్స్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఆకుల సత్యం, నవీన్‌రెడ్డి, రజనీకాంత్, వెంకటరెడ్డి, అంతగిరి, గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20: సిరిసిల్ల పట్టణంలోని వివిధ వార్డులను మంగళవారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ బేగ్‌అలీ సిబ్బందితో కలసి సందర్శించారు. వార్డులోని ప్రధాన మురికి కాలువలు, డ్రైనేజీలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాటమయ్య రక్షణ కవచంపై గీత కార్మికులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వెనకబడిన తరగతుల అధికారి విజయలక్ష్మి కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో తాటి వనంలో మంగళవారం కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై గీతకార్మికులకు శిక్షకుల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రవి పాల్గొన్నారు.

హైకోర్టుకు చేరిన స్థల సేకరణ వివాదం

● మున్సిపల్ నిర్ణయంపై కోర్టుకు వెళ్లిన భూ యజమానులు ● కలెక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులు, పాలకవర్గానికి నోటీసులు

సిరిసిల్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కొత్త చెరువు పార్కు, బండ్ నుంచి తుమ్మలకుంట చెరువు వరకు వరద నీరు వెళ్లేందుకు ప్రైవేటు భూమిలో కాలువ తవ్వేందుకు మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోగా భూయజమానులు కోర్టును ఆశ్రయించారు. కొత్త చెరువుకు సంబంధించిన రెండు కాలువలు కబ్జాకు గురికావడం, పూడికతీత లేకపోవడంతో 2022లో వచ్చిన భారీ వర్షాలకు వరదనీరు వెళ్లే దారిలేక చెరువు కింది ప్రాంతంలోని కాలనీల్లోకి భారీగా నీరు చేరింది. దీంతో అత్యవసరంగా మున్సిపల్ కౌన్సిల్ ప్రైవేటు భూముల నుంచి కాలువను తవ్వి వరదనీరు వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వరద ముగిసిన తరువాత కాలువను పూడ్చివేస్తామని జీ1 1206- 2022 ద్వారా భూయజమానులకు సమాచారం అందించారు. ఆ తరువాత మున్సిపల్ కౌన్సిల్ కాలువను పూడ్చివేయకుండా 1530 సర్వే నెంబర్‌లోని భూమిని సేకరించడానికి యజమానులకు జీ 2 1127 - 2023 ద్వారా మున్సిపల్ నోటీసులు ఇచ్చారు. రెండు కాలువలు ఉన్నప్పటికీ వాటిని బాగు చేయకుండా స్థల సేకరణకు నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ భూయజమానులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు భూసేకరణను తప్పుపడూతూ 1530 సర్వే నెంబర్ స్థలంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని మంగళవారం ల్యాండ్ అక్యుపేషన్ కార్యదర్శితో పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి, తహసీల్దార్, జిల్లా ఎస్పీ, సీఐలతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణిలకు హైకోర్టు నోటీసలు ఇచ్చింది. కొంతకాలంగా కొత్త చెరువు బండ్ కింద కాలువల నిర్మాణం విషయంలో వివాదం, భూమి యజమానుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. గతంలోనే 21370 కేసు పెండింగ్‌లో ఉంది. కొత్త చెరువు కింద రెండు కాలువలు ఉన్నప్పటికీ వాటిని బాగు చేయకుండా కొత్త కాలువ నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ పూనుకోవడం చర్చనీయాంశంగా మారింది. ల్యాండ్ అక్యుపేషన్‌కు చేస్తే మున్సిపల్‌కు సంబంధించిన లక్షలాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే విమర్శలు ఉన్నాయి. 750 చదరపు గజాల విస్తీర్ణంలో తవ్వకాలు జరిపి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న దానిపై హైకోర్టు జోక్యం చేసుకోవడం సిరిసిల్లలో చర్చనీయాంశంగా మారింది.



కాలువ తీసిన ప్రైవేటు స్థలం

వస్త్ర పరిశ్రమలో సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమతో పాటు టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేసే కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు కార్మికులకు రావాల్సిన సబ్సిడీలను అందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరైన టెస్కో జీఎం అశోక్‌రావు, ఏడీ మిట్టకోల సాగర్‌లను మంగళవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ చీరలకుసంబంధించి మరమగ్గాల కార్మికులకు సిరిసిల్లలో మీటర్‌కు 37 పైసలు, టెక్స్‌టైల్ పార్క్‌లో మీటరుకు రూ 1.12 పైసలు తగ్గించి ఇచ్చిన వాటిని వెంటనే అందించాలని అలాగే 2023 సంవత్సరానికి సంబంధించిన యారన్ సబ్సిడీ అందించాలని కోరారు.



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గంజాయి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 20: గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో మండపల్లి మూల మలుపు వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. గంజాయి నిర్మల కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్టులు చేయ డంతో పాటు నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయించిన, సేవించిన, సాగు వివరాల సమాచారం అందించాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి



మత్స్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 20: ఎల్ఎస్ఆర్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించాలని, ఇందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎల్‌ఆర్‌ఎస్, ధరణి, ఆర్‌ఓఆర్ చట్టంపై జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్ఎస్ఆర్ దరఖాస్తుల్లో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేసేలా చూడాలన్నారు. ఈ భూములు నీటివనరుల బఫర్‌జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోని కావని ధ్రువీకరించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఎక్కడా ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని అదే విధంగా నీటివనరులు, కాలువలు, చెరువుల ఆక్రమణలకు పాల్పడ వద్దని అధికారులకు సూచించారు.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 42,941

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి మొత్తం కలిపి 42,941 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసే విధానం, వివరాల నమోదుపై వివరించారు. ప్రభుత్వ భూముల విషయమై అందరి వద్ద సమాచారం ఉండాలని స్పష్టం చేశారు. నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు పాల్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్, మున్సిపాలిటీల్లో హెల్ప్‌డెస్క్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీసీపీఓ అన్సారీ, డీపీఓ వీర బుచ్చయ్య, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను ఆక్వాహబ్‌గా అభివృద్ధి చేయాలి : కలెక్టర్

వన్ డిస్ట్రిక్, వన్‌ప్రోడెక్ట్ కింద జిల్లాను ఆక్వాహబ్‌గా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం చేపల పెంపకం, మార్కెటింగ్‌లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వన్ డిస్ట్రిక్, వన్ ప్రోడెక్ట్ కింద చేపలు ఎగుమతి చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న 300 ఎకరాల భూమి అదేవిధంగా 450 చెరువులల్లో చేపల ఉత్పత్తి చేసి వాటికి మంచి మార్కెట్ డిమాండ్ కల్పించే దిశగా చర్యలు తీసుకుటున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మత్స్యకారరులకు అదాయం మెరుగువుతుం దన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, పరిశ్రమల శాఖ జీఎం భారతి, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, లీడ్‌బ్యాంక్ మేనే జర్ మల్లిఖార్జున్‌రావు, జిల్లా మత్స్యపరిశ్రమల శాఖ అధికారి వరదారెడ్డి, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు రామచం ద్రం అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలో రూ.4.5 లక్షల ఫీజు స్వాహా

సొంత అకౌంట్‌లోకి ఫీజుల బదలాయింపు

గతంలో మరో కార్పొరేట్ పాఠశాలలోనూ ఇదే తరహా ఘటన

కలవర పడుతున్న పోషకులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: గోదావరిఖనిలో మరో కార్పొరేట్ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కలిసి విద్యార్థుల ఫీజులు స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. రూ.4.5లక్షల ఫీజులను సదరు ప్రిన్సిపాల్ వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఫీజులు చెల్లించేందుకు వచ్చిన పోషకుల నుంచి తమ స్కూల్ అకౌంట్ పని చేయడం లేదని తమ సొంత అకౌంట్‌లలోకి పంపాలంటూ బదలాయించుకున్నట్లు తెలుస్తున్నది. సదరు పాఠశాల యాజమాన్యం మాత్రం ఇప్పుడే తామేమి చెప్పలేమని, అన్నీ విషయాలు పరిశీలన చేస్తున్నామని పేర్కొంటున్నది.

గత సంవత్సరం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక ప్రముఖ కార్పొరేట్ పాఠశాలలో కూడా ప్రిన్సిపాల్ సుమారు రూ.7లక్షల వరకు విద్యార్థుల ఫీజులతో ఉడాయించిన ఘటన వెలుగు చూసింది. యాజమాన్యం ఆధారాలు చూపిన విద్యార్థుల ఫీజులను మాత్రం సర్దుబాటు చేసుకుంది. ఆధారాలు లేని వారి నుంచి మళ్లీ వసూలు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న కార్పొరేట్ పాఠశాలల్లో ఈ తరహా మోసాలు జరుగడం కలవరపెడుతుంది.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో అంజన్న సన్నిధిలో భక్తులు

మల్యాల, ఆగస్టు 20: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ఆదమరిస్తే అంతే..



రామడుగు వాగుపై ఉన్న వంతెనపై పక్కకు ఒరిగిన టిప్పర్

రామడుగు, ఆగస్టు 20: రామడుగు వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు అప్పుడప్పుడు మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గుంతలు పడి దిగబడుతున్నాయి. మంగళవారం ఓ టిప్పర్ వంతనెన దాటుతూ దిగబడి పక్కకు ఒరిగింది. కొత్త వంతెన పూర్తయినా ప్రారంభించడం లేదు. ఇకనైనా కొత్త వంతెనను ప్రారంభించాలని మండల వాసులు కోరుతున్నారు.

దుబ్బపల్లిలో పేకాట స్థావరంపై దాడి

మంథనిరూరల్, ఆగస్టు 20: మంథని మండలంలోని దుబ్బపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మంథని పోలీసులు దాడి చేయగా ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 3 బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్‌లు, రూ. 20,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పిగుడుపాటుకు వ్యక్తి మృతి

మంథనిరూరల్, ఆగస్టు 20: మండలంలోని పందులపల్లికి చెందిన ఉడుత నారాయణ(52) సోమవారం రాత్రి పడుగుపాటుతో మృతి చెందినట్లు మంథని ఎస్ఐ రమేష్ మంగళవారం తెలిపారు. నారాయణ తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పిడుగుపాటు గురై మృతిచెందినట్లు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలతో చేపలను వేటాడిన వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: వ్యవసాయ పొలం వద్ద ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగలను అపహరించి సమీప వాగులో చేపలను వేటాడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కుంచం పర్శరాములపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన వట్టెల రాజు బోరు మోటారు కరెంటు తీగలను ఈ నెల 13న కుంచం పర్శరాములు దొంగిలించి సమీపంలోని వాగులో చేపలు పట్టాడు. విషయం రాజుకు తెలియడంతో విద్యుత్ తీగలను ఇవ్వాలని కుంచం పర్శరాములును కోరగా అందుకు ఆయన బెదిరింపులకు దిగాడు. కరెంటు తీగలను అపహరించడంతో పాటు విద్యుత్‌తో వాగులో చేపలను వేటాడిన కుంచం పర్శరాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. నీటి వనరుల్లో విద్యుత్ షాక్‌లు పెట్టి ఎవరైనా చేపలు వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కస్టమ్ గోల్డ్ ఉచ్చులో ఖని వ్యాపారులు

రూ.10కోట్లు పోగొట్టుకున్న బాధితులు

హైదరాబాద్‌లో మోసగాళ్లను పట్టుకున్న పోలీసులు

తలలు పట్టుకుంటున్న రామగుండం వ్యాపారులు

కోల్‌సిటీ, ఆగస్టు 20: కస్టమ్స్ పట్టుకున్న బంగారం తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు మోసగాళ్లు పన్నిన ఉచ్చులో గోదావరిఖనికి చెందిన వ్యాపారులు పడ్డారు. సమారు రూ.10కోట్లు పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. కస్టమ్స్ అధికారులు పటు కున్న బంగారంలో సగం వరకు ప్రభుత్వ లెక్కల్లో చూపరని, దానిని మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరకు ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు రామగుండం ప్రాంతానికి చెందిన వ్యాపారులతో బేరాలు కుదుర్చుకున్నారు. మొదట తక్కువ మోతాదులో అసలు బంగారం ఇవ్వడంతో నమ్మిన ఈ ప్రాంత వ్యాపారులు తమకు దగ్గర ఉన్న మరికొందరు వ్యాపారులను ఈ దందాలోకి దించినట్టు తెలుస్తోంది. రెండుమూడు సార్లు ఈ విధంగా ట్రేడింగ్ చేసిన వ్యాపారులు వారికి మధ్యవర్తులుగా మారిపోయారు. దీంతో ఈ గోల్డ్ ట్రేడింగ్‌లో కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తోంది. చివరికి హైదరాబాద్ చెందిన వ్యక్తులు మకాం ఎత్తివేసి వ్యాపారులకు దొరకకుండా తప్పించుకుని తిరిగారు. వీరిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయడంతో ఈ దందా వెలుగు చూసింది. రెండుమూడు స్థావరాలు ఏర్పాటు చేసుకుని నకిలీ నోట్ల కట్టలు, నకిలీ బంగారం బిస్కెట్లను ఎరగా చూపి గోదావరిఖనికి చెందిన వ్యక్తుల నుంచి భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇంట్లోని బంగారం, ప్లాట్లు, ఆస్తులు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులు కూడా పెట్టుబడి పెట్టారని చర్చ జరుగుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 20: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 11,427 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 16.4 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 5,261 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 3150, మానేరు, మూలవాగు ద్వారా 2,111 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.21 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం మంగళ వారం కొంత పెరిగింది. ఎస్సారెస్పీలోకి 14,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 50.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 4,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కళాశాల బోధనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్

కొడిమ్యాల, ఆగస్టు 20 : కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని జేఎన్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులను, సౌకర్యాలను విపులంగా వివరించారు. సాంకేతిక విద్యా బోధన, పరీక్షల నిబంధనలు విద్యార్థులకు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న వసతులను తెలిపారు. కళాశాలలో విద్యార్థులు పాటించాలిసిన విధానాలను, తల్లిదండ్రుల బాధ్యతలను వివరించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ విభాగాల అధిపతులను విద్యార్థుల తల్లిదండ్రులకు పరిచయం చేశారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డా.. కె. శ్రీనివాస్, డా.. బి. సతీష్‌కుమార్, డా.. ఎస్. సురేష్‌కుమార్, డా.. వై. రాజశేఖర్‌రెడ్డి, డా.. సురేష్‌అర్జుల్లా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్ రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్



నేరెళ్ల శారదకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 20: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావిం చగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదం అందజేసి శేషవస్త్రం కప్పి సన్మానిం చారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కనికరపు రాకేష్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు

మల్యాల: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మంగళవారం కొండ గట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో వచ్చిన చైర్‌పర్సన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్క రిం చారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. చైర్‌పర్సన్ వెంట ఆలయ, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



కొండగట్టులో పూర్ణకుంభతో స్వాగతం పలుకతున్న అర్చకులు

శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరపాలి



నేరసమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

- నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలి
- తెలంగాణలో మావోయిస్టులు లేరు
- డీజీపీ జితేందర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 : కేసుల విచారణ శాస్త్రీయ పద్ధతిలో జరపాలని, నేర ఘటనలకు సంబంధించిన సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో డీజీపీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కేసులు ట్రయల్స్‌కు వచ్చిన సమయంలో కేసు తీవ్రతను బట్టి అవసరమైతే డీఎస్పీలు సైతం కోర్టుకు వెళ్లి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వ్యవరించాలన్నారు. సీసీ కెమెరాలు నేర పరిశోధన, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు వాటి ప్రాముఖ్యతను తెలిపి అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డీఎస్పీ, సీఐలు, డివిజన్, సర్కిల్ వారీగా శాంతి భద్రతల సమస్యలను అధిగమించేందుకు కార్యచరణ కలిగి ఉండాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేశారు. మతపరమైన సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సమీక్షా సమావేశానికి కరీంనగర్ కమిషనరేట్ కు వచ్చిన డీజీపీ డాక్టర్ జితేందర్‌కు మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌లు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల చేత డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. సమీక్షా సమావేశంలో కరీంనగర్ పోలీస్ కమీ షనర్ అభిషేక్ మొహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, మూడు జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడమే తమ లక్ష్యమని, దాని కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం తగు చర్యలు తీసుకుంటూనే అక్రమ ఇసుక రవాణా, సైబర్ నేరాలు, డ్రగ్స్ కంట్రోల్, గంజాయి అక్రమ రవాణా, సరఫరాపై డేగ కన్నేసినట్లు తెలిపారు. భూకబ్జాలను అరికట్టడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు వస్తున్న సమాచారం మేరకు అప్రమత్తమై చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో సిబ్బంది కొరతను పూర్తిగా అధిగమిస్తామని అన్నారు. 13 వేల మంది ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని, రెండు, మూడు నెలల్లో విధుల్లో చేరుతారని డీజీపీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారి కదలికలపై ఆరా తీస్తున్నామన్నారు.

తెలంగాణలో గంజాయి ఉత్పత్తి లేదని, ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం నుంచి సరఫరా అవుతుందన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని, ఇతర రాష్ట్రాలకు పారిపోయారన్నారు. సైబర్ క్రైం బ్యూరోను దేశంలో తెలంగాణలోనే మొదటగా ఏర్పాటు చేసి 85 కోట్ల రూపాయలు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో కోటి 60 లక్షలు రికవరీ చేశామన్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నవారు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే నిమిషాలలో ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసి ట్రాన్స్‌ఫర్ అయిన డబ్బులను వెనక్కి తీసుకువస్తామన్నారు. నార్కోటిక్ బ్యూరోను కూడా సీనియర్ అధికారులతో ఏర్పాటు చేశామన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ చాలా స్ట్రిక్ట్ ఆఫీసనే విషయం తెలుసుకదా... ఈఓడబ్ల్యు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ రేంజ్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఐపీఎస్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీరెడ్డిలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మూడు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు

బీసీ గణన తర్వాతనే

'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి..

పెద్దపల్లి బీసీ సదస్సులో నాయకుల డిమాండ్..

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే బీసీ గణన చేపట్టాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజూరి శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి బీసీ సదస్సును నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సదస్సులో బీసీ జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సదస్సుకు హాజరైన వారినుద్దేశించి సదరు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై వివక్ష చూపుతున్నదని, దీనిని ఖండిస్తున్నామన్నారు. పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లాడిన విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఓబీసీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వివరించారు.


స్వాతం త్రం వచ్చినప్పటి నుంచి నేటికీ బీసీ గణన జరగ లేదని పేర్కొన్నారు. భారతదేశాన్ని పాలించిన తెల్ల దొరలు ఓబీసీ గణన చేశారే తప్ప స్వతంత్ర భారతదేశంలో బీసీ గణనకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనగణన చేస్తామని మాట ఇచ్చి కేబినెట్‌లో తీర్మానం చేసిందే తప్ప ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టలేదన్నారు. బీసీ గణన చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నదని, బీసీ గణన చేపట్టే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని అన్నారు. బీసీల తలరాతలు మారాలంటే వెంటనే బీసీ గణన చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు, పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షులు రాజారామ్ యాదవ్ సోషలిస్టు పార్టీ అధ్యక్షులు పిడికిలి రాజు, మాజీ జడ్పీటీసీలు గంటా రాములు యాదవ్, కందుల సంధ్యారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, బీసీ నాయకులు బండారు శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మారం తిరుపతి యాదవ్, శిలారపు పర్వతాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టా శైలజ, మాజీ జడ్పీటీసీ సంపత్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్, పడాల రవీందర్ గౌడ్, చంద్రమౌళి, పొట్యాల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ బీసీ నాయకులకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 20: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో అప్పులబాధతో కౌలు రైతు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన వేముల మల్లేశం (40) మూడు సార్లు గల్ఫ్ వెళ్లి అక్కడ సరైన ఉపాధి దొరకక తిరిగి వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం లేక స్థానికంగా ఐదెక రాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరినాటు వేశాడు. గల్ఫ్ అప్పులు, సాగు కోసం చేసిన అప్పులు ఐదు లక్షల రూపాయలు తీర్చే మార్గం లేక అప్పుల బాధతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మల్లేశంకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఎస్సై సీహెచ్ గణేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గేదెపై వీధి కుక్కల దాడి

తిమ్మాపూర్, ఆగస్టు 20: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో వీధి కుక్కలు వీరంగం వేశాయి. ఎల్ఎండీ కాలనీలోని చిందం రాజు అనే రైతు తన గేదె ను తన ఇంటి పక్కన ఉన్న తన పశువులను కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో కొన్ని వీధి కుక్కలు పశువులపై దాడి చేసి అందులో ఉన్న గేదెను హత మార్చాయి. అక్కడ ఉన్న మిగతా పశువులపై దాడి చేసేందుకు ప్రయత్నించాయి. చప్పుడు వినిపించి నిద్ర లేచిన రైతు రాజు కుక్కలను అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. మృతి చెందిన గేదె విలువ 20వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రాజు కోరాడు.

విద్యుత్‌షాక్ తో గేదె మృతి

జగిత్యాలరూరల్,ఆగస్టు 20: మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన గడ్డం మల్లయ్యకు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెం ది నట్లు నర్సింగాపూర్ గ్రామస్థులు తెలిపారు. సోమవారం అదే గ్రామానికి చెందిన మద్దెల లచ్చన్నకు చెందిన గేదె మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలో రెండు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

చేనేత టెక్నాలజీ కోర్సులకు పిల్లలను పంపించాలి

టేస్కో జీఎం అశోక్‌రావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న టేస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, అగస్టు 20 : తెలంగాణ రాష్ట్రానికి నూతనంగా మంజూరైన ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హండ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో పిల్లలను చేర్పించేందుకు నేతన్నలు తమ పిల్లలను పంపించాలని టేస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో మంగళవారం ఇండియన్స్ ఇన్స్టిట్యూట్ అఫ్ హ్యాండ్లూం టెక్నాలజీలో చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లపై నేతన్నలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడరు. రాష్ట్రానికి మంజూరైన దీనిలో మొదటి సంవత్సరం కోర్సులలో చదువుతోపాటు నేర్చుకునేందుకు 60 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు.

ఇందులో నేర్చుకునే వారికి ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకునేలా నేతన్నలు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఇందులో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండడంతో పాటు 01-07-2024 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 23 సంవత్సరాలు కలిగి ఉండాలని అలాగే షెడ్యూల్ కులాలకు చెందిన వారైతే 25 సంవత్సరాలు ఉన్నవారి అనుమతులు ఉంటాయన్నారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పూర్తి వివరాల కోసం బీవైనగర్‌లోని చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళీశాఖ ఏడీ మిట్టకోల సాగర్, మ్యాక్స్ సంఘాల అధ్యక్షులు, ఎస్ఎస్ఐ యూనిట్‌ల యాజమానులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న యాజమానులు, ఆసాములు

రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించిన అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20: రాష్ట్ర పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. ఈనెల 17,18వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగిన తెలంగాణ అండర్- 23 పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని వివిధ అంశాలలో పతకాలను సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. మహిళల లాంగ్ జంప్‌లో సిహెచ్ పూజ బంగారు పతకం, వంద మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించింది. యం వినయ్ 3వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, 100మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. ఇ.విష్ణువర్ధన్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో బంగారు పతకం, కె.వైష్ణవి 400మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 2వందల మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. ఎస్ అజయ్ 20కిలో మీటర్ల రేస్ వాక్‌లో రజత పతకం, కె.రవి 800మీటర్ల పరుగులో కాంస్య పతకం సాదించారు. ఎ సంతోష్ 3వేల మీటర్ల స్టీపుల్ చేస్‌లో రజత పతకం, ఎ వివేకానంద ట్రిపుల్ జంప్‌లో రజత పతకం, కె స్వామి జావలెన్ త్రోలో రజత పతకం, డి. మాలుపతి 100మీటర్ల పరుగులో రజత పతకం సాదించి అండర్ 23 సంవత్సర విభాగంలో చాంపియన్‌లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా కారులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతి లను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, డివైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ బాధ్యులు బి.రాజగోపాలచారి, కటకం రవి, హరికిషన్, సుమన్ కళ్యాణ్, రమేష్, బిషన్‌సింగ్, కార్యదర్శి కడారి రవి అభినందించారు.



పతకాలు సాధించిన అథ్లెటిక్స్

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వేములవాడలో నందికమాన్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు


చందుర్తిలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ మాట్లాడారు. దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ కీలక పాత్ర ఉందన్నారు. ఆర్థికంగా వెనకబడిన భారత దేశాన్ని నాటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అగ్రదేశాల పక్కన నిలబెట్టాడని అన్నారు. 18 సంవత్సరాల యువతీ, యువకులకు ఓటు కల్పించారని అన్నారు. దేశంలో సమాచార, సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చారన్నారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటును బీఆర్ఎస్ పార్టీ అడ్డుకోవాలని చూస్తే ఊరుకోమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, పట్టణ ఉపాధ్యక్షుడు వెంకటేశం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, కౌన్సిలర్లు వేముల రవి, భూక్య రెడ్యానాయక్, మాజీ కౌన్సిలర్ రాగుల జగన్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : కాంగ్రెస్ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళ భాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సానియా బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు రమాదేవి, సిరిసిల్ల మండల అధ్యక్షురాలు హారిక రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అరుణ, సుధ సరిత, రోజా లత రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, తిరుపతి, రాజయ్య, గంగయ్య, దేవయ్య, బుచ్చాగౌడ్, రాజేందర్, మహేందర్, రాజునాయక్, రాంరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, నరేందర్, గోపాల్, బాలయ్య, బాల్‌రెడ్డి, సాయిరెడ్డి, రఫీక్, ఇమాం తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హరిలాల్, గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రమౌళి నాయకులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలో మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఓరుగంటి తిరుపతి, బుచ్చిరెడ్డి, బాల్‌రెడ్డి, కరుణాకర్, భాను, మాదాసు అనిల్, గంత రాజు, తలారి నర్సింలు, కొండల్‌రెడ్డి, రమేష్, దుబ్బాక రాజు, నవీన్, గోవర్ధన్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణం, మండలంలో కాంగ్రెస్ నేతలు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని నందికమాన్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా తిప్పాపూర్ గ్రామంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, కనికరపు రాకేష్, దుర్గం పర్శరాములు, కత్తి కనుకయ్య, ఎర్రం రాజు, ఎర్రం ఆగయ్య,వంకాయల భూమయ్య తదితరులు ఉన్నారు.

● చందుర్తి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింత పంటి రామస్వామిలు, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్‌లు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, భీమారాజు కనకరాజు, బండారి శేఖర్, గొట్టె ప్రభాకర్ పాల్గొన్నారు.

● కోనరావుపేట: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య చేపూరి గంగాధర్ చందనగిరి గోపాల్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, తాళ్లపెల్లి ప్రభాకర్, రమేష్‌రెడ్డి, మానుక సత్యం, లింబయ్య, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి (చందుర్తి): రుద్రంగి మండల కేంద్రంలో ఇంద్ర చౌక్ చౌరస్తాలో, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ఎర్రం గంగనరసయ్య, చేలుకల తిరుపతి, కొమిరె శంకర్, గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు. మానాల గ్రామంలో దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కు వంశీ, జక్కు మోహన్, రవిందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి: మండలంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తడగొండలో జరిగిన కార్యక్ర మంలో చొపదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్తంభంపల్లి గ్రామంలో హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠ శాలకు చెన్నాడి రవీందర్‌రావు స్మారకార్థం బెంచీలను అందజేయగా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్తంభంపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రంతో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు మాజీ సర్పంచ్ జ్యోతి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనకయ్య, జిల్లా బీసీసీ అధ్యక్షులు కూస రవీందర్, మండల శాఖ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, మాజీ ఎంపిటిసి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 20 : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీపై హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్ ఇచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకుని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన రంగం జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులకు రావాల్సిన గుడ్లబిల్లు, వంట కార్మికులకు చెల్లింపులు సరిగా జరుగడం లేదన్నారు. హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటల తయారీ ఆలోచన విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేష్, రామంచ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గోగూరీ ప్రదీప్‌రెడ్డి, కోశాధికారిగా కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా కొప్పుల కర్ణాకర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కుందనపల్లి రవీందర్‌రెడ్డి, ఎర్ర భాల్‌రెడ్డి, జంకె లచ్చిరెడ్డిలు సలహాదారులుగా వ్యవహరించనున్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ వివేక రచయితల సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్ల లోపు విద్యార్థులకు మంగళవారం పాటల పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ వివేక రచయిత సంఘం అధ్యక్షుడు పర్శరాములు, అధ్యాపకులు చంద్రమౌళి, విష్ణుప్రసాద్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళగౌరీ వ్రతాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 20: మండల కేంద్రంలోని వైశ్యభవనంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక మంగళగౌరి వ్రతాలు నిర్వహించారు. తొలుత మంగళగౌరి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉప్పల రామచంద్రం, ఉప్పల వేణు, ఉప్పల అమర్, నార్ల రాంకిషన్, బోణగిరి రాజేందర్, దొంతుల శంకర్, కిషన్, రాము, నార్ల దినేష్, అంజయ్య, వెంకటేశం, లక్ష్మన్, సత్యం, అశోక్, శ్రీనివాస్, రాజు, రవీందర్‌లతో పాటు మహిళలు పాల్గొన్నారు.

రేపు చలో కలెక్టరేట్ కార్యక్రమం

తంగళ్లపల్లి, ఆగస్టు 20: ఈ నెల 22న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు, దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్‌లో చలో కలెక్టరేట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, దళిత సంఘాల నాయకులు గుంటి వేణులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ పేరుతో రిజర్వేషన్లు రద్దు చేయాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఎస్సీలందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోవంకాయల భూమయ్య, గొట్టె లింబయ, బాలయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వీర్నపల్లి, ఆగస్టు 20 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ బ్రీడింగ్ చెక్కర్ గోవర్ధన్ అన్నారు. వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ చైతన్యతో కలిసి ప్రతి ఇంటి పరిసరాలను పరిశీలించి మంగళవారం డ్రైడే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో దోమల స్ప్రే, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్లు తెలిపారు. ఇందులో ఏఎన్ఎంలు కీర్తి, సుజాత, పంచాయతీ కార్యదర్శి రణధీర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్ మర్రి వెంకట్‌రెడ్డి కుమారుడు అనిల్‌రెడ్డి- చందనారెడ్డి వివాహ వేడుకలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్యతో పాటు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, హైమద్, బాల్‌రెడ్డి, రమేశ్, జబ్బర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాశాఖ కమిషన్ కార్యాలయం ఎదుట ధర్నా

కోనరావుపేట, ఆగస్టు 20: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21న హైదరాబాదులోని విద్యాశాఖ కమిషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టినట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. కోనరావుపేట ఎంఈఓ కార్యాలయంలో మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రయత్నాన్ని మానుకోవాలని అన్నారు. మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల పెండింగ్ బిల్లులను వెంటనే అమలు చేయాలన్నారు. హైదరాబాదులోని విద్యాశాఖ కమిషన్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలు జ్వరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

కోనరావుపేట ఆగస్టు 20: ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ వెంకటేష్ అన్నారు కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు పద్మ, జమున, హేమలత తదితరులు ఉన్నారు.

ప్రమాదకర గుంతను పూడ్చివేసిన యువతి


రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చివేస్తున్న యువతి

రుద్రంగి,(చందుర్తి) ఆగస్టు 20: రుద్రంగి మండల కేంద్రంలో శివారులోని కోరుట్ల- వేములవాడ ప్రధాన రహదారిలో రుద్రంగి-కలికోట గ్రామాల మధ్య గుంత ప్రమాదకరంగా మారింది. గుంతతో వాహనదారులు ఇబ్బందులు పడడంతో రుద్రంగి మండల కేంద్రంకు చెందిన మర్రిపెల్లి భాని అనే యువతి ఇసుక, కంకర తీసుకువచ్చి గుంతలను పూడ్చివేసింది. యువతిని రుద్రంగి గ్రామస్థులు అభినందించారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు అంధకారం


ఎల్లారెడ్డిపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమాకాంత్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: యువత మాదక ద్రవ్యాల వినియోగంతో బంగారు భవిష్యత్తు కలిగిన జీవితంలో అంధకారం నెలకొంటుందని ఎస్ఐ రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాదక ద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం యువకులకు ఆయన అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. ఉన్నత విద్యపై దృష్టి సారించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. మత్తు పదార్థాలపై తమకు సమాచారం అందించాలని కోరారు.

● వీర్నపల్లి: మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్ఐ ఎల్లాగౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలను సాగు, రవాణా చేసినట్లు గానీ, సేవిస్తున్నట్లుగానీ, విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఫోన్ 8712656392 నంబర్‌కి వివరాలు తెలుపాలన్నారు.

ముస్తాబాద్ బంద్ విజయవంతం

ముస్తాబాద్, ఆగస్టు 20: ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. అఖిలపక్షం పిలుపు మేరకు ముస్తాబాద్ మండల కేంద్రంలో తలపెట్టిన బంద్‌కు వ్యాపార వాణిజ్య సంస్థలు పెట్రోల్ బంకులు విద్యాసంస్థలు సహకరించారు. కలకత్తాలో, బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటనలకు నిరసనగా పూర్తిస్థాయిలో మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు మీరు అంజా గౌడ్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి, అఖిలపక్ష నాయకులు నల్ల నరసయ్య, మిరుదొడ్డి భాను కరుణాకర్, బాల్‌రెడ్డి, చేకోటి మహేష్ తదితరులు ఉన్నారు.

బద్ది పోచమ్మకు బోనాల మొక్కులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 20 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున మట్టి పాత్రలో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల, బైండ్లవాళ్ల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. నెత్తిన బోనాలతో భక్తులు క్యూలైన్‌లో నిరీక్షించి మరి అమ్మవారికి ఒడిబియ్యం పోసి నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు.


వేములవాడ బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తులు

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 20 : రాఖీ పండుగ రోజున రాఖీలను అక్కలు, చెల్లెలతో కట్టించుకునేందుకు గురుకుల పాఠశాలకు వచ్చిన వారిని అనుమతించకపోవడంతో కిటికీల నుంచి రాఖీలను కట్టించుకున్న సంఘటనలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాను ఏబీవీపీ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంజిత్‌కుమార్ మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలం బద్దెనపపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాఖీ పండుగ సందర్భంగా తోబుట్టువులకు రాఖీ కట్టన్వికుండా విద్యార్థుల పట్ల కర్కశంగా వ్యవహరించారన్నారు. గురుకుల విద్యార్థులు , తల్లిదండ్రులు రక్షాబంధన్ చేసుకోలేని దుస్థితిలో ఆవేదనతో ఇంటికి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. పండుగను జరుపుకోనివ్వకుండా పిల్లలు, తల్లిదండ్రుల పట్ల కర్కశంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ లా ఫోరమ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, పట్టణ జాయింట్ కార్యదర్శి కాసారపు నితిన్, ఉపాధ్యక్షులు రుద్రవేణి ధనుష్, వెంకటేష్ ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

● మానవత్వం చాటిన గ్రామస్థులు, పోలీసులు

గంభీరావుపేట, ఆగస్టు 20: గంభీరావుపేట మండలం నర్మాల మానేరు క్యాంపులో ఓ అనాథ మహిళ మృతదేహానికి పలువురు గ్రామస్థులు మంగళవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే... నర్మాల క్యాంపు బస్టాండ్‌లో దాదాపు మూడేళ్లుగా మతి స్థిమితం సరిగా లేని ఓ అనాథ మహిళ భిక్షాటన చేసుకుంటూ జీవించేంది. సోమవారం ఉదయం చెద్దరు కప్పుకుని ఆ మహిళ ఉండడంతో నిద్రిస్తుందని గ్రామస్థులు భావించారు. మరుసటి రోజు మంగళవారం సాయంత్రం సమయంలో అక్కడ వాసన వస్తుండడంతో గ్రామస్థులకు అనుమానం వచ్చి పరిశీలించారు. మహిళ మృతిచెంది ఉండడంతో గ్రామ మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజుకు సమాచారం అందించారు. శవం కుళ్లిపోయి వాసన వస్తుండడంతో సోమవారం ఉదయమే మహిళ మృతిచెందినట్లు భావించి రాజు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ రామ్మోహన్, మాజీ సర్పంచ్ రాజు, ఇతర గ్రామస్థులు లచ్చయ్య, నర్సింహులు, రాజు అఖిల్‌ల సహకారంతో మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని నిరసనలు

గంభీరావుపేట, ఆగస్టు 20 : గంభీరావుపేట మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు కార్యకర్తలు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చీకటి ఒప్పందంలో బాగంగానే ఈ రోజు వర్గీకరణ తీర్పు వెలువడిందని, ఇందులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు. దళితులు కలిసి ఉంటే రాజ్యాధికారం దిశగా వెలుతారని భావించి, ఎస్సీలను వర్గీకరించి, విభజించారని వాపోయారు. ఏబీసీడీల వర్గీకరణను వ్యతిరేకిస్తు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండ గడుతూ 21న బుధవారం బారత్ బంద్‌కు మద్దతుకు అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మల్యాల రాజవీర్, మాల మహానాడు మండల అదక్షుడు లక్కం బాబు, అధికార ప్రతినిధి పిట్ల రఘు, నాయకులు దోసల శంకర్, బండ రమేష్ తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 21న తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసి వేసి ప్రజలు బంద్‌కు సహకరించాలని మాల మహానాడు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ అడ్‌హక్ కమిటీ కో కన్వీనర్ జంగ భూమరాజం, మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు మీస శ్రీనివాస్, నాయకులు మీస శంకర్, బెల్లం స్వామి, శాగల లక్ష్మణ్, గువ్వల రవి, పిట్ల చంద్రం, ఇరిగి సుందరయ్య, గాద నర్సింలు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : భారత ఉన్నత న్యాయస్థానం ఎస్సీలను వర్గీకరించాలని తీర్పు చెప్పడాన్ని నిరసిస్తూ మాల మహానాడు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం భారత్ బంద్ నిర్వహించాలని మాల ఐక్య వేదిక నాయకులు పాటి దినకర్ పిలుపునిచ్చారు. వీర్నపల్లి మండల కేంద్రంలో మాలల ఐక్యవేదిక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వాలు 341 ఆర్టికల్ విధి విధానాలు పాటించకుండా ముందుకు వెళ్లడం సరైందికాదన్నారు. ఒక కులాన్ని తీయాలన్నా, చేర్చాలన్న పార్లమెంట్‌లో చర్చించి ఆమోదం కోసం రాష్ట్రపతికి బిల్లు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో కూడా తీర్మానాలు ఆమోదించి కేంద్రానికి పంపించాల్సి ఉంటుందన్నారు. భారత్ బంద్‌కు వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు సహకరించి బంద్ పాటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు నిరంతర ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య ఉన్నారు.


గంభీరావుపేటలో నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

● ఎల్లారెడ్డిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసి వేయాలని కోరారు. నాయకులు రాజ్‌కుమార్, రామచంద్రం, రవీందర్, విజయ్‌కుమార్, జగన్, సాయిచంద్, సందీప్, హరికృష్ణ, జితేందర్, రాజు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : ఎస్సీవర్గీకరణకు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తు బుధవారం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించాలని కోరారు. వీరిలో నాయకులు చాతర్ల బాబు, మామిడి శేఖర్, చాతర్ల రాజు, మహేందర్, అనీల్, పర్శరాం. రాము, సురేష్, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● చందుర్తి: భారత్‌బంద్‌లో భాగంగా చందుర్తి మండలంలో బుధవారం బంద్ విజయవంతం చేయాలని తెలంగాణ మాల మహానాడు మండల సంఘం అధ్యక్షులు నీరటి శ్రీనివాస్ అన్నారు. సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణపై తీర్పును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు మండల ఉపాధ్యక్షులు సిరిగిరి సుధాకర్, నాయకులు బత్తుల ఉదయ్ కుమార్, సంటి నవీన్, బత్తుల కమలాకర్, సంటి ప్రసాద్, నీరటి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా


మర్తన్‌పేటలో విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను చదివిపిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కోనరావుపేట, ఆగస్టు 20 : విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండలంలోని మర్తన్‌పేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తరగతి గదుల్లో ప్రతిరోజు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని పాఠ్యాంశాలను చదివించాలని అన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన వచ్చేలా బోధించాలన్నారు. ప్రతి ఒక్కరిపై దృష్టి పెట్టి చదవడం, రాయడం మాథ్స్, ఇంగ్లీష్ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.